క్లుప్తంగా

13న హనుమత్ వ్రతం

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామ స్వామి ఆలయంలో ఈనెల 13వ తేదీన హనుమద్వ్రతం సందర్భంగా ఆలయంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈఓ యర్రా వేంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30కి స్వామివారికి పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించనున్నారు.

హైందవ శంఖారావానికి సహాయం అందించండి



హైందవ శంఖారావం వివరాలను చినజీయర్ స్వామికి వివరిస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

బోట్‌క్లబ్: వచ్చే ఏడాది జనవరి 5న విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావానికి సహాయ సహకారాలు అందించాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా కన్వీనర్ ఆర్ రవిశంకర్ పటాన్నాయక్ త్రిదండి శ్రీరామానుజ చినజీయర్ స్వామిజీని కోరారు. ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన స్వామిజీని స్థానిక భానుగుడి సెంటర్‌లోని క్రోమా కాంప్లెక్సులో విశ్వహిందూ పరిషత్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. హైందవ శంఖారావం కార్యక్రమ ఫలితాలు సఫలీకృతం కావాలని స్వామి మంగళాశాసనాలు చేశారు. స్వామిజీని కలిసిన వారిలో పరిషత్ సభ్యులు భానోజీరావు, సుబ్రహ్మణ్యం, సుధాకర్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు తలాటం శంకరరావు, లిఖిత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



పాతర్లగడ్డలో క్షతగాత్రుడిని 108లోకి ఎక్కిస్తున్న స్థానికులు

కరప: మండలం పాతర్లగడ్డవద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలవ్వగా కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం... కాజులూరు గ్రామానికి చెందిన కంపసత్తి సురేష్ మాధవపట్నంలో కోళ్లను కొనుగోలు చేసి, మోటార్ సైకిల్ తిరిగి పయనమయ్యాడు. కరప మండలం పాతర్లగడ్డ గ్రామం వద్దకు వచ్చే సరికి రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో సురేష్ తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు స్పందించి 108కు సమాచారం ఇచ్చి కాకినాడ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కరప పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేశ రక్షణలో నౌకా దళం కీలక పాత్ర



రమణయ్యపేటలో నేవీ మాజీ ఉద్యోగులకు సన్మానం

కాకినాడ రూరల్: దేశ రక్షణలో నౌకా దళం కీలక పాత్ర పోషిస్తుందని నేవీ మాజీ అధికారి ఎం.బుచ్చయ్య పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో బుధవారం నౌక నావికా దళ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాకిస్తాన్ యుద్ధంలో మన దేశం నావికా దళం విజయాల చిహ్నంగా డిసెంబరు 4న నౌకా దళ దినోత్సవం జరుపుకొంటున్నామన్నారు. అనంతరం అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్ ఆధ్వర్యంలో నేవీ మాజీ ఉద్యోగులు బుచ్చయ్య, సీఆర్‌ఫీ ప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు.

నేషనల్ సైన్స్ పోటీల్లో మున్సిపల్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థుల బృందం

బాలాజీచెరువు: ఐఐటీ గౌహతీలో నిర్వహించిన ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్ట్ పోటీల్లో కాకినాడ గోడారిగుంట మదర్‌థెరిసా మున్సిపల్ విద్యార్థుల బృందం ప్రతిభ చూపారు. సీబీఎస్‌ఈ స్కూల్స్ పాల్గొన్న ఈ పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు బిందు, దీపిక, ప్రవల్లిక బృందం మొదటి స్థానం సాధించి రూ.30వేలు నగదు బహుమతి పొందారు. విద్యార్థులతో పాటు గైడ్ రామచంద్రారెడ్డిను పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.శ్రీనివాసు, యూటీఎఫ్ నాయకులు రమణ, ఉపాధ్యాయులు అభినందించారు.

డైట్.. ఫైట్..

- కూటి కోసం రోగుల పాట్లు
- డైట్ సెక్షన్ వద్ద గంటల కొద్దీ పడిగాపులు
- భోజనంలో నాణ్యతా లోపం
- మెనూలో కొన్ని ఐటమ్స్‌కు కొర్రీ
- జీజీహెచ్‌లో దయనీయ స్థితిలో రోగులు, వారి సహాయకులు

కాకినాడ క్రైం: కడుపు నింపుకోవడం కోసం నిరుపేద రోగులు నానా పాట్లు పడుతున్నారు. పట్టెడన్నం కోసం గంట కొద్ది వేచి ఉంటున్నారు. అది కూడా అరకొర ఉండడంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. కాకినాడ జీజీహెచ్‌లో రోగు పరిస్థితి అధ్వానంగా ఉంది. గుత్తేదారు కాసుల వేట, అధికారుల నిర్లక్ష్యం వెరసి రోగులకు శాపంగా మారింది. పోషకాహారం అంటూ ప్రభుత్వం చెబుతున్నా చిమిడిపోయిన అన్నం, నీరు లాంటి సాంబారు, రుచి పచీ లేని కూరలే ఆ పూట కడుపు నింపుకోవడానికి రోగులకు గతి అవుతున్నాయి. రోగి అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవడానికి పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం భోజన ఏర్పాటు చేసినా ఆ ప్రయోజనాలు మాత్రం రోగులకు అందడం లేదు. కాసుల వేటే పరమావధిగా సరఫరా చేస్తున్న భోజనం పూర్తి నాసిరకంగా ఉంటోంది. ఆ మాత్రం భోజనానికి కూడా రోగులు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. ఎండనక వాననక క్యూలో పడిగాపులు కాస్తున్న తీరు, వారి మధ్య జరుగుతున్న తోపులాట ఓ యుద్ధాన్నే తలపిస్తోంది. ఆకలితో అంతటి ప్రయాసలో ఖాళీ గిన్నెలు పట్టుకొని వరుసల్లో గంటల తరబడి నిలుచున్న తీరు చూస్తే గుండె చెరువవుతోంది.

భోజనంలో వ్యర్థాలు పడినా..

ఆసుపత్రిలో రోగులకు అన్నంపెట్టే డైట్ సెక్షన్ సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. సక్రమంగా, నాణ్యమైన ఆహారాన్ని అందించడంలేదు. వారికి తోచినట్టుగా వ్యవహరిస్తున్నారు. దీంతో రోగి కడుపు నింపడం కోసం వారి కుటుంబ సభ్యులు పడరాని పాట్లు పడుతున్నారు. ఉదయం 7.30 గంటలకు, మధ్యాహ్నం 12 గంటలకు, సాయంత్రం 6 గంటలకు రోజులో మూడు నాలుగు గంటలు క్యూలోనే ఉంటున్నారు. గంటల కొద్ది వేచి ఉండడంతో నీరసించిపోతున్నారు. డైట్ సిబ్బంది చెట్ల కిందే ఆహారాన్ని అందిస్తున్నారు. చెట్లపై ఉన్న పిట్టలు వేసే మల విసర్జకాలు ఆహారంలో పడుతున్నా పట్టించుకోవడంలేదు.

ఒంటరి రోగుల ఆకలి కేకలు

కాకినాడ జీజీహెచ్ ఓ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం. ఇక్కడ ఒంటరి రోగులకైనా వైద్యులు సేవలందిస్తారు. ఒంటరి రోగులు ఇన్‌పేషంట్‌గా చేరితే వారికి ఆకలి కేకలు తప్పడం లేదు. ఎందుకంటే సత్తువ లేక అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆ రోగికి భోజనం తెచ్చి ఇచ్చేవారు లేక గుప్పెడు మెతుకుల కోసం తన శక్తిని కూడగట్టుకొని తానే వెళ్లి వరుసల్లో నిల్చోవలసిన దయనీయ స్థితి కొనసాగుతోంది. వార్డుల్లో అక్కడక్కడ ఉంటూ చికిత్స పొందే అతి కొద్ది మంది ఒంటరి రోగుల కోసం అయినా డైట్ విభాగం సిబ్బంది వార్డుకి వెళ్లి భోజనం అందించరు.. సరికదా అటువంటి వారి కోసం కనీసం అధికారులు కూడా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

గుడ్లు గుటుక్కు...

ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూలో అందించాల్సిన ఐటమ్స్ విషయంలో పెద్ద కుట్రే జరుగుతోంది. అన్నం, కూర, పప్పు, పెరుగు, గుడ్డు, అరటిపండు సాధారణ మెనూలో ఉంటుండగా అవి ఆచరణలో ఉండడం లేదు. డైట్ సిబ్బంది చాలా మందికి గుడ్లు ఇవ్వడం లేదు. కొంత మందికి మాత్రం ఇచ్చి అయిపోయాయంటూ చెబుతున్నారు. అరటిపండు, పెరుగు కూడా ఇవ్వ కుండా అక్రమాలు పాల్పడుతున్నారు. చాలా మంది ప్లేట్లలో కొంత అన్నం, ఇంకొంత సాంబారు తప్ప మరో పదార్థం కనిపించడం లేదు. ఈ విషయంపై పలువురు రోగుల కుటుంబ సభ్యులు తమ గోడును వెళ్లబుచ్చుకున్నారు.



ఆహారం కోసం బారులు తీరిన రోగుల సహాయకులు

ఎందుకీ తోపులాట అని అడిగితే...

వరుసల్లో నిలుచుంటున్న రోగులు సహాయకులు ముందు మేమంటే మేమంటూ ఘర్షణలు పడుతున్నారు. ఎందుకీ తోపులాట, అందరికీ ఆహారం అందుతుంది కదా అని అడిగితే, వరుసలో ముందు ఉన్న వారికే అన్నీ ఐటమ్స్ వస్తాయి. మిగిలిన వారికి సాంబార్ అన్నమే గతి అంటూ తమ ఆవేదనను వెళ్లగక్కిన తీరు చలింపజేసింది.



చెట్ల కిందే ఆహారం సరఫరా

వీల్ చైర్ తీసుకెళ్లే దారుల్లో...



స్ట్రెక్చర్ మార్గంలో ఆహారం కోసం నిరీక్షిస్తున్న రోగుల సహాయకులు

రోగులను అత్యవసరంగా తరలించే వీల్ దారిలో ఆహారం కోసం పడిగాపులు పడుతున్నారు. దీంతో వీల్ చైర్లు, స్రెక్చర్‌ల ద్వారా రోగులను తరలించేందుకు ఇబ్బంది కలుగుతోంది. పూటలో కనీసం గంటన్నర చొప్పున రోజులో కనీసం ఐదు గంటల పాటు భోజనం దగ్గరే ఉంటున్నారు. దీంతో ఆ మార్గం గుండా వీల్‌చైర్లు, స్రెక్చర్లలో రోగులను తరలించడం ఓ ప్రయాసగా మారింది.

పసివాళ్లే పనివాళ్లు



రోగి సహాయకురాలైన బాలికతో సాంబార్ పంపిణీ చేయిస్తున్న దృశ్యం

జీజీహెచ్ డైట్ కాంట్రాక్టర్ సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించుకోకుండా అమాయకులైన రోగుల బంధువులతోనే పని చేయిస్తున్నారు. పైసా చెల్లించకుండా వారితో పని చేయించుకుంటున్నారు. ఏ వార్డుకి ఆ వార్డు సమీపంలో ఎవరు ఖాళీగా దొరికితే వారిని అన్నం వడ్డించమని, సాంబారు వేయమని చెబుతున్నారు. చెబితే వింటారనే భావనతో పిల్లల్ని ఇందుకు వినియోగిస్తున్నారు.

కాలు తొలగించడంతో కుంటుకుంటూ..

సుగర్ వ్యాధి కారణంగా ఓ రోగి కాలు తొలగించారు. వార్డులో చికిత్స పొందుతున్న అతడికి సహాయకులు ఎవరూ లేరు. భోజనం కోసం నానా పాట్లు పడుతున్నాడు. భోజనం తెచ్చేవారు లేక అతడే ఓ వాకర్ సాయంతో క్యూలో ఉండేందుకు వెళ్లాడు. గంట వేచి ఉండి అన్నం తీసుకున్నాడు. వాటిని తీసుకుని కుంటుకుంటూ అతి కష్టం మీద స్ట్రెచ్చర్ మార్గం నుంచి వాకర్‌తో మెల్లిగా ముందుకు వెళ్లాడు. అంతే, ఒక్కసారిగా వాకర్ జారి కుప్పకూలిపోయాడు. తనతో తెచ్చుకున్న సాంబారు, ఆహారం తన మీదే పడిపోయింది. తొలగించిన కాలికి కట్టు, యూరిన్ బ్యాగ్, ఒంటి కాలితో పడిపోయి ఉన్న అతడి దీన స్థితిని చూసి అందరూ చలించిపోయారు.



ఒంటి కాలితో, యూరిన్ బ్యాగ్‌తో బెడ్ మీద నుంచి ఆహారం కోసం లేచి వచ్చిన రోగి, అతి కష్టం మీద తిరిగి వెళుతూ..

ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

ఆర్డీవో మల్లిబాబు

కాకినాడ సిటీ: కాకినాడ మెక్లారిన్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ మెటీరియల్ పంపిణీని కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ డివిజన్‌లో ఎన్నికలకు సంబంధించి 11 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. సుమారు 2,519 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారన్నారు. గురువారం ఎన్నిక జరుగుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కాకినాడ డివిజన్‌లో 10 మండలాలకు సంబంధించి నాలుగు రూట్లు ఏర్పాటు చేయడమైందన్నారు. పోలింగ్ ఆఫీసర్లు, సహాయ పోలింగ్ ఆఫీసర్లు, ఇతర పోలింగ్ సిబ్బంది, రూట్ ఆఫీసర్లు, జోనల్ ఆఫీసర్లను నియమించామన్నారు. ఎన్నికల విధి నిర్వహణ సిబ్బంది, పోలీసు బందోబస్తు మధ్య ఎన్నికల సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించినట్టు ఆర్డీవో మల్లిబాబు తెలిపారు. ఎన్నికల క్రతువు సజావుగా సహకరించాలని సిబ్బందికి సూచించారు. ఈ పరిశీలనలో ఆర్డీవోతో పాటు కార్యాలయపు పరిపాలనాధికారి జీఆర్ ఠాగూర్, ఉప గణాంకాధికారి రమణమూర్తి, డిప్యూటీ తహసీల్దార్లు రామ్‌కుమార్, కృష్ణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల గానం అజరామరం

బోట్‌క్లబ్: తన గానంతో అందరినీ ఓలలాడించిన ఘంటసాల కారనజన్ముడని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. బుధవారం ఘంటసాల వేంకటేశ్వరరావు 102 జయంతిని ఘంటసాల సంగీత కళాపీఠం, సీతారామరాజు కళావేదిక ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. స్థానిక బాల త్రిపుర సుందరి ఆలయ సమీపంలో ఉన్న ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఘంటసాల చలన చిత్ర పరిశ్రమకు చేసిన సేవలు మరువలేనివన్నారు. ఘంటసాల వంటి గాయకుడు మళ్లీ పుట్టరన్నారు. సూర్య చంద్రులు ఉన్నంత వరకూ దేశ ప్రజలు మదిలో ఘంటసాల గానం అజరామంగా ఉంటుందన్నారు. సంస్థ అధ్యక్షుడు కర్రి అచ్యుతరామారెడ్డి, గౌరవ అధ్యక్షులు కర్రి భామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పంపన దయానందబాబు మాట్లాడుతూ ఘంటసాల గాత్రంలో ప్రతి ఆలయంలోను, ప్రతి ఇంటిలోను వినిపిస్తూనే ఉందన్నారు. ఆయన గానంలో అంత మాధుర్యం ఉందన్నారు. సంస్థ ఆధ్వర్యంలో కాటన్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. విగ్రహానికి కాపు సద్భావన సంఘ అధ్యక్షుడు వాసిరెడ్డి ఏసుదాసు రూ.10 వేలు విరాళం అందించారన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి ముఖ్యఅతిథులు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, ఘంటసాల పెద్ద కోడలు కృష్ణకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక కళాకారులు నిర్వహించిన సంగీత విభావరి నగర ప్రజలు ఎంతగానో ఆకట్టుకుంది.



ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ



రమణయ్యపేటలో ఘంటసాల చిత్రపటానికి నివాళులు

గాన గంధర్వుడు ఘంటసాల

కాకినాడ రూరల్: రమణయ్యపేటలో గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఘంటసాల చిత్ర పటానికి సాహిత్యవేత్త డాక్టరు శిరీష తదితరులు నివాళులర్పించారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, ప్రసాద్‌నాయుడు, శ్రీనగేష్, బుచ్చయ్య, సీఆర్‌సీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నవజాతి శిశువు రక్షణగా ధృతి ఫౌండేషన్ ట్రస్ట్

బోట్‌క్లబ్: నవజాత శిశువుల సంరక్షణకు ధృతి ఫౌండేషన్ ట్రస్ట్ అండగా నిలుస్తుందని బ్లూరైన్ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఎం.శుభోశఖర్‌రెడ్డి అన్నారు. నవజాత శిశువుల తల్లిదండ్రులు ఆధ్వర్యంలో బుధవారం వైద్యులు శుభోశేఖర్‌రెడ్డిని, సుజన, ఇతర సిబ్బందిని హాస్పిటల్ ప్రాంగణంలో సత్కరించారు. ఫౌండేషన్ ట్రస్ట్ సహాయ సహకారాలు వల్లే తాము 102 శిశువులను సంరక్షించగలిగామన్నారు. శిశువులు 1.1 కేజీల లోపు బరువు ఉన్నవారు జన్మించారని, అందులో ముగ్గురు మాత్రం 500 నుంచి 600 గ్రాముల లోపే జన్మించారన్నారు. వారిని కూడా వైద్య చికిత్స ద్వారా రక్షించగలిచామని అన్నారు. గర్భిణుల వైద్య సేవలు పొందుతున్న సమయంలో లోపల ఉన్న శిశువు హైరిస్క్‌తో ఉన్నట్టు గమనించడం తల్లిదండ్రులకు ఈ విషయాన్ని తెలిపి వైద్యుల సంరక్షణలో సుఖ ప్రసవానికి అవసరమైన వైద్య సేవలు అందించడం ద్వారా వారిని సంరక్షిస్తున్నామన్నారు. నవజాత శిశువుల వైద్య సేవలకు ధృతి ఫౌండేషన్ 50 శాతం ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు.



డాక్టర్ శుభశేఖర్‌రెడ్డిని సత్కరిస్తున్న నవజాత శిశువుల తల్లిదండ్రులు

టైలరింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని ఏపీఎస్పీ మూడో బెటాలియన్ క్యాంపు కార్యాలయంలో మహిళల స్వయం ఉపాధి కోసం కమాండెంట్ ఎం.దీపిక చొరవతో టైలరింగ్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆమె చేతుల మీదుగా ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ టైలరింగ్ శిక్షణ ద్వారా తర్ఫీదు పొందడంతో మహిళలకు స్వయం ఉపాధి పొందేందుకు ఆస్కారం ఏర్పడుతుందని, తద్వారా కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు వీలవుతుందన్నారు. మీ పిల్లలకు మీరే స్వయంగా మీ డబ్బులనే ఖర్చుపెట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. సిబ్బంది కుటుంబ సభ్యులకు ఎటువంటి సహాయ సహకారాలు కావాల్సినా చేసేందుకు సిద్ధంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్లు మురళీకుమార్, మోహనరావు, చంద్రశేఖర్, మన్మథరావు, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఏపీఎస్పీ బెటాలియన్ క్యాంపు కార్యాలయంలో మహిళలతో మాట్లాడుతున్న కమాండెంట్ దీపిక

అలయన్స్ సేవలు గ్రామ స్థాయిలో అందించాలి



అలయన్స్‌క్లబ్ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు

బాలాజీచెరువు: అలయన్స్ క్లబ్ సేవలు గ్రామ స్థాయిలో అందించాలని అలయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్, శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ప్రైవేట్ హోటల్లో బుధువారం అలయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ వనుం శ్రీనివాసరావు అధ్యక్షతన క్యాబినేట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్లబ్‌లో ఎక్కువగా జీవిత కాలపు సభ్యత్వం చేయించాలని సూచించారు. ఇంటర్నేషనల్ డైరెక్టర్ మాటూరి శిరీష మాట్లాడుతూ క్లబ్ ద్వారా చేసే కార్యక్రమాలు ఇంటర్నేషనల్ కమిటీకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ కొయ్యన కుమారి, కార్యదర్శి వరలక్ష్మి, దీలిప్‌కుమార్ సదానాని, పూర్వపు గవర్నర్ మునిరెడ్డి, కృష్ణప్రసాద్, గ్రంధి లలిత, లీల పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల తనిఖీ



చెక్‌పోస్టుల వద్ద రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాహుల్ మీనా

కాకినాడ సిటీ: కాకినాడ పోర్టు సమీపంలోని చెక్ పోస్టులను జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోర్టు సమీపంలోని శక్తి గేట్ అండ్ బొంబే కాటా చెక్‌పోస్టులను ఆయన తనిఖీ చేశారు. ప్రతి లారీల్లో ఉన్న సరకును తనిఖీ చేసి పంపించాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీలో ఎన్ని లారీలు వెళ్లాయి, ఏమేమి సరుకు వెళ్లింది. లారీలో ఎంత సరకు వెళ్లింది తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను జేసీ రాహుల్ మీనా తనిఖీ చేశారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి దారుణం



జేసీ రాహుల్‌మీనాకు వినతిపత్రం ఇస్తున్న విశ్వహిందూ పరిషత్, బీజేపీ నాయకులు

బోట్‌క్లబ్: గత నాలుగు నెలలుగా బంగ్లాదేశ్‌లో హిందువులపై, హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడి చాలా దారుణమని విశ్వహిందూ పరిషత్ సభ్యులు వాపోయారు. బంగ్లాదేశ్‌పై హిందువుల దాడులను ఖండిస్తూ పరిషత్, బీజేపీ నాయకులు స్థానిక భానుగుడి సెంటర్‌లో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తుమ్మల పద్మజ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లోని హిందువులకు ప్రతి భారతీయుడు అండగా నిలవాలన్నారు. భానుగుడి సెంటర్‌లో ధర్నా అనంతరం జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అప్పాజీ, రవిశంకర్ పట్నాయక్, గట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

లోక రక్షకుడు ఏసు ప్రభువు



వేళంగిలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు

కరప: సర్వలోక రక్షకుడు ఏసు ప్రభువని మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ రెవరెండ్ పి.సత్యప్రసాద్‌బాబు పేర్కొన్నారు. వేళంగిలో బుధవారం మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ ఎ.ప్రసాద్ పాల్ క్రిస్మస్ సందేశం వినిపించారు. ఏసు ప్రభువు గురించి, ఏసుతల్లి మరియ ఏడు మంచి లక్షణాలను వివరించి, బోధనలు వినిపించారు. పాస్టర్స్ డాక్టర్ ఆర్.ప్రతాప్‌కుమార్, డాక్టర్ జె.పాల్ ప్రసాద్, డాక్టర్ పి.ఆమ్యూల్‌రాజు, జిల్లా ప్రెసిడెంట్ ఐ.జాన్‌సూరిప్రకాష్, చైర్మన్ డాక్టర్ స్టీఫెన్‌బాబు కార్యక్రమాన్ని నిర్వహించగా మండల పాస్టర్లు క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా క్విజ్ నిర్వహించి, బహుమతులు అందజేశారు. అనంతరం జిల్లా నాయకులు డాక్టర్ డి.శామ్యూల్‌సాగర్, ఎస్.ఐజాక్, ఎం.విజయ్‌కుమార్, డాక్టర్ డి.జాషువాగిరి తదితరుల ద్వారా మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్‌ను లాంఛనంగా ప్రారంభించగా, జోన్-2 కోఆర్డినేటర్ రూ.10 వేలు, పంపన విజయరాజు రూ.5 వేలు విరాళంగా ఇచ్చారు.



బెరాకా చర్చిలో మాట్లాడుతున్న యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిఫ్ జిల్లా అధ్యక్షుడు శామ్యూల్ సాగర్

ఘనంగా జిల్లా ఐక్య క్రిస్మస్

కాకినాడ రూరల్: కాకినాడ జిల్లా యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిఫ్ ఆధ్వర్యంలో జిల్లా ఐక్య క్రిస్మస్ వేడకను బుధవారం ఘనంగా నిర్వహించారు. రమణయ్యపేటలోని బేరాక బ్లెస్సింగ్ హోమ్ చర్చిలో అధ్యక్షుడు రెవరెండ్ దొమ్మేటి శామ్యూల్ సాగర్ గౌరవ అధ్యక్షుడు బిషఫ్ రెవరెండ్ జోషెఫ్ బెన్నీ, సెక్రటరీ శీరం ఐజాక్, విక్టర్ సామ్యూల్, రెవరెండ్ సురేంద్ర, విజయ్‌కుమార్‌ల అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పంతం నానాజీ ముఖ్యఅతిథిగా పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకలో జిల్లాలోని ఏడు రీజనల్స్‌లోని జిల్లా కమిటీ నాయకులు, వైస్ ప్రెసిడెంట్లు, 21మండలాలకు చెందిన 40ఫెలోషిఫ్‌లోని నాయకులు పాల్గొన్నారు. యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిఫ్ అధ్యక్షుడు శామ్యూల్ సాగర్ మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకలు నెల రోజులు పాటు ఘనంగా జరుపుకొందామని పిలుపునిచ్చారు.